క్లుప్తంగా

నేనూ గురుకుల విద్యార్థినే

● ఎస్పీ జానకి



రాజాపూర్ (బాలానగర్): నేనూ గురుకుల విద్యార్థినే అంటూ.. మిమ్మల్ని చూస్తుంటే నాబాల్యం గుర్తుకు వస్తుందని ఎస్పీ జానకి అన్నారు. గురువారం బాలానగర్ మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలని సూచించారు. జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్‌ఐ తిరుపాజి, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం టీఎన్‌జీఓ భవన్‌లో ఓ స్పోకెన్ ఇంగ్లిష్ కేంద్రం నిర్వాహకుడిపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలనే డిమాండ్‌తో రౌండ్ టేబుల్‌సమావేశం నిర్వహించనున్నట్లు చైతన్య మహిళా సంఘం జిల్లా కార్యదర్శి శ్రీదేవి, బాధితురాలు మహేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులకు అండగా నిలబడాలనుకునే వాళ్లు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఉద్యోగులకు బిల్లులు రాక అవస్థలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు రాక అవస్థలు పడుతున్నారని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, సరెండర్, మెడికల్ బిల్లులు, పదవీ విరమణ పొందిన వారికి రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవసరాలకు అప్పులు పుట్టక నానా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

వెల్డర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయేంద్రచారి

జడ్చర్ల టౌన్: వెల్డర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయేంద్రచారి ఎన్నికయ్యారు. గురువారం గంగాపురం రోడ్డులో నిర్వహించిన వెల్డర్ల సమావేశంలో ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా మహమ్మద్ ఏయ, తబ్రస్, కార్యదర్శిగా హమీద్, కార్యవర్గ సభ్యులుగా రబ్బాని, గిరి, ఖాజ, నాసర్, మనివర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా విజయేంద్రచారి మాట్లాడుతూ వెల్డింగ్ పని చేయటంతో కంటి సమస్యలు వస్తున్నాయని, అందుకే సంక్షేమం కోసం అసోసియేషన్ ఏర్పాటుచేసుకున్నట్లు తెలిపారు.

విద్యార్థినులకు బూట్లు పంపిణీ

జడ్చర్ల: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం కౌన్సిలర్ శ్రావణి ఆధ్వర్యంలో బూట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సొంత ఖర్చులతో విద్యార్థినులకు బూట్లు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్, లక్ష్మమ్మ, ప్రమీళ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

భూత్పూర్ : స్థానిక వివేకానంద విద్యాలయంలో గురువారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి సహచర విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా అఖిల్‌నాయక్, డీఈవోగా కౌశల్, ఎంఈవోగా బలరాం నాయక్, ప్రధానోపాధ్యాయురాలుగా రాజేశ్వరి, కరస్పాండెంట్‌గా చరణ్, ఉపాధ్యాయులుగా శివ, తేజస్విని, బార్గవి, మధుప్రియ, సాయి తేజ, నిహారిక, హర్షిత్, అనుప్రియ, సహస్ర, మనస్వి, హారిక, శరణ్య,కౌశిక్, పీఈటీలుగా మహేష్, వివేక, అటెండర్లుగా వాసు , గౌతమ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సి. నర్సింహులు, ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీవాణి, ఎం.శిరీష,శివకుమార్, గౌతమి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: స్ఫాజ్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా క్యాబినెట్ సబ్‌కమిటీ సభ్యులు రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుకు వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శోభారాణి, సౌమ్య, సురేష్‌గౌడ్, షహీన్, ఖాజన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నవాబుపేట మండలం చౌడూరు గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు



జడ్చర్ల 9వార్డు గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

ఎవరూ ఆందోళన చెందొద్దు

● అర్హులందరికీ సంక్షేమ పథకాలు
● కలెక్టర్ విజయేందిర బోయి
● జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



జడ్చర్ల మండలం చిట్టిబోయిన్‌పల్లి గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

జడ్చర్ల టౌన్: జాబితాలో పేరు లేకపోయినా అర్హత ఉంటే వారి దరఖాస్తు పరిశీలించి మంజూస్తారు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందొద్దు అని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. జడ్చర్ల మండలం చిట్టిబోయిన్‌పల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని వెల్లడించారు. గ్రామసభలో చదివిన జాబితాలు దరఖాస్తు దారుల జాబితామాత్రమేనని, తుది జాబితా కాదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, కార్యదర్శి రాజేశ్వరి పాల్గొన్నారు.

● జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో గురువారం జరిగిన ప్రజాపాలన వార్డు సభలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పా ల్గొన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టంచేశారు. వార్డుసభలో కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ చైతన్య చౌహాన్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డులది నిరంతర ప్రక్రియ..

మహబూబ్‌నగర్ రూరల్/నవాబుపేట: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అదనపు కలెక్టర్ మోహన్‌రావు తెలిపారు. గురువారం మండలంలోని ఫతేపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయా పథకాలకు అర్హులైన లబ్ధిదారులు గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గ్రామసభలో ఎంపీఓ శంకర్‌నాయక్, ఎంఆర్‌ఐ చంద్రకాంత్, సూపర్‌వైజర్ సరిత, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి పాల్గొన్నారు. నవాబుపేట మండలంలోని చౌడూరులో నిర్వహించిన గ్రామసభలో అదనపు కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాం నాయక్ పాల్గొన్నారు.

● మహబూబ్‌నగర్ మండలంలోని ధర్మాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిరసనలు, నిలదీతలతో ముగిశాయి. ఆరు గ్యారెంటీలపై తహసీల్దార్ సుందర్‌రాజ్, మండల వ్యవసాయ అధికారి శృతిని నిలదీశారు. గ్రామాల్లో అధికారులు జాబితాలు ప్రకటించడంతో వాగ్వాదానికి దిగారు. ఫతేపూర్, మాచన్‌పల్లి తండా, భవాని తండా, ధర్మాపూర్, చౌదర్‌పల్లి, అప్పాయిపల్లి, కోటకదిరలో జరిగిన గ్రామసభలకు 823 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ కరుణశ్రీ తెలిపారు.

గ్రామసభకు 371 దరఖాస్తులు

భూత్పూర్ : మున్సిపాలిటీలో గురువారం జరిగిన గ్రామ సభలో 371 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ మేనేజర్ శంకర్ తెలిపారు. 3వ వార్డులో ఇందిరమ్మ ఇళ్లకు 56, రేషన్ కార్డులు 39, 7వ వార్డులో ఇందిరమ్మ ఇళ్లకు 23, రేషన్ కార్డులు 98, 10వ వార్డులో ఇందిరమ్మ ఇళ్లకు 51, రేషన్ కార్డుల కోసం 104 దరఖాస్తులు వచ్చాయన్నారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హుల జాబితాలో పేర్లు లేవని..

అడ్డాకుల: మండలంలోని కాటవరం, రాంచంద్రాపూర్, ముత్యాలంపల్లి, వర్నె, శాఖాపూర్, మూసాపేట మండలంలోని అచ్చాయపల్లి, తిమ్మాపూర్, వేముల, సంకలమద్ది గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. కొందరు గ్రామస్తులు అర్హుల జాబితాలో తమ పేర్లు లేవని కొత్తగా దరఖాస్తులను అందజేశారు.

● మండలంలోని పొన్నకల్, రాంచంద్రా పూర్ గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో పింఛన్లు, గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు దరఖాస్తులు అందాయి. పింఛన్లకు పొన్నకల్‌లో 20, రాంచంద్రాపూర్‌లో 6 దరఖాస్తులు, గృహజ్యోతికి 2, మహాలక్ష్మికి ఒక దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోండి

చిన్నచింతకుంట: మండలంలో చిన్నవడ్డేమాన్, ఏదులాపురం, మద్దూర్, అల్లీపూరం, తిర్మలాపూరం, దాసర్‌పల్లి గ్రామాల్లో గ్రామసభ నిర్వహించారు. అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పేర్లు లేనివారు గ్రామ సభలో దరఖాస్తులు చేసుకోవాలని, ఈ అవకాశాని సద్వినియోగించుకోవాలని సూచించారు. మండల మహిళ సమాఖ్య ఏపీఎం విష్ణు చారి, ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకట్రాములుతో ఉన్నారు.

ప్రశాంతంగా..

మిడ్జిల్: మండలంలోని ఈదులబావితండా, బోయిన్‌పల్లి, వస్పుల, వల్లభ్‌రావుపల్లి, కంచన్‌పల్లి, మల్లాపూర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు ప్రశాంతంగా కొనసాగినట్లు ఎంపీడీఓ గీతాంజలి తెలిపారు. ఆత్మీయభరోసాకు 24, ఇందిరమ్మ ఇళ్లకు 199, రేషన్ కార్డుల కోసం 186, రైతు భరోసాకు 3 అదనంగా దరఖాస్తులు వచ్చాయన్నారు. మండల ప్రత్యేకాధికారి వెంకటేష్, తహసీల్దార్ రాజు, ఏఓ సిద్దార్థ, ఏఈ అస్రత్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



జడ్చర్ల మండలం నసరుల్లాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: గ్రామసభల ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. గురువరం మండలంలోని నసరుల్లాబాద్, మల్లెబోయిన్‌పల్లి, బాదేపల్లిలోని 18వ వార్డులోని నిమ్మబాయిగడ్డలో జరిగిన గ్రామసభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అర్హులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతాయని, ఆ బాధ్యత తమపై ఉందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడ్డాయని అన్నారు. ఈ ఏడాది ముడాకు రూ.29 కోట్లు సమకూరితే తన పట్టుదలతో ఇప్పటికే రూ.6.50 కోట్లు నియోజకవర్గానికి తీసుకువచ్చినట్లు తెలిపారు. నసరుల్లాబాద్ చెరువు కట్టను మినీ ట్యాంకు బండ్‌గా మారుస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ రహీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం

● ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్



పేరూర్‌లో మాట్లాడుతున్న ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర రూరల్: పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని ఏఐసీసీ సెక్రటరీ, తెలంగాణ ఇన్‌ఛార్జ్ విశ్వనాథన్ అన్నారు. గురువారం కౌకుంట్ల మండలం పేరూర్‌లో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో అవినీతి పాలన కొనసాగిందన్నారు. ఆగిపోయిన పేరూర్ లిఫ్ట్ పనులు ప్రారంభించామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆరవింద్ రెడ్డి, మండల అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, మార్కెట్ చైర్మన్ కతలప్ప, కూరుమూర్తి దేవస్థాన చైర్మన్ గోవర్దన్ రెడ్డి, మాజీ సర్పంచ్ చమన్, అన్ని శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● వీర్యానాయక్‌తండాలో జరిగిన గ్రామసభలో జాబితాలో వచ్చిన లబ్ధిదారుల పేర్లను ఎంపీడీఓ శ్రీనివాసరావు ప్రకటించారు. పేర్లు లేనివారు కొత్తగా దరఖాస్తులు అందించాలని కోరారు. ఆర్‌ఐ శరత్, ఏపీఓ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఆరు గ్రామాల్లో మొత్తం 634 దరఖాస్తులొచ్చాయి.

నేతాజీ ఆశయాలు యువతకు ఆదర్శం

● ఎంపీ డీకే అరుణ



మహబూబ్‌నగర్‌లోని గాజులపేటలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యువకులు

సాక్షి నెట్‌వర్క్ : నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలు యువతకు ఆదర్శమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. సుభాష్ చంద్రబోస్ 128వ జయంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి ఎంపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పద్మజారెడ్డి బీజేపీ నాయకులు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా నేతాజీ విగ్రహాలకు, చిత్రపటాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● జడ్చర్లలోని నేతాజీ చౌరస్తాలోని ఆయన విగ్రహం వద్ద నేతాజీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆసంఘం అధ్యక్షుడు జీవన్‌గుండప్ప, బి.రవిశంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. సంస్కారభారతి ఆధ్వర్యంలో సరస్వతి శిశుమందిరం, అనురాగిణి ఆశ్రమంలో ఆయన చిత్రపటాలు ఏర్పాటుచేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● మహబూబ్‌నగర్ మండల పరిధిలోని గాజులపేటలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలి



మోటివేటర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దేవరకద్ర రూరల్: విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు ప్రణాళికతో సిద్ధం కావాలని ఇంపాక్ట్ మోటివేటర్ దొడ్ల జనార్దన్ సూచించారు. గురువారం లక్ష్మిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన కల్పించారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక ప్రకారం చదవాలని ఆయన సూచించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కలిసి మోటివేటర్‌ను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం మురళీధర్, ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్, ఆసఖాద్రి, శంకర్, కమల్ రాజ్, మదన్‌మోహన్, సూజాత పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

దేవరకద్ర రూరల్: కౌకుంట్లలో వివిధ కారణాలతో ఇటీవలే మృతిచెందిన కుమ్మరి నవీన్, పూజారి శ్రీనివాసులు కుటుంబాలను గురువారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న శేఖర్, నీలి సూజాతలను సైతం పరామర్శించారు. అంతకుముందు రాజోలిలో జరిగిన ఆంజనేయస్వామి, శివాలయం నిర్మాణ పునఃప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బాలచందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త సవరన్న అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని గురువారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కారెడ్డి నాగిరెడ్డి పరామర్శించారు. సవరన్న మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి విజయమోహన్‌రెడ్డి, సయ్యద్‌షఫి, దశరత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పరుషరాములు, బాలయ్య, రాములున్నారు.



జర్నలిస్టు కాలనీని అభివృద్ధి చేస్తాం

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



జర్నలిస్టు కాలనీలో మౌలిక వసతుల కల్పన పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం, చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పట్టణంలో జర్నలిస్టు కాలనీని ఉత్తమ కాలనీగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో గురువారం మౌలిక వసతుల కల్పన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల వరకే రాజకీయం పరిమితం చేయాలని, ఆ తర్వాత మహబూబ్‌నగర్ అభివృద్ధి మాత్రమే ముఖ్యమన్నారు. పచ్చని పాలమూరు కోసం అహర్నిశలు కృషి చేస్తామని అన్నారు. అనంతరం రూ.90.75లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కాటమయ్య భవన్ వద్ద హైమాస్ట్ లైట్లను ప్రారంభించి, రూ.30లక్షలతో నూతనంగా నిర్మించనున్న భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కౌన్సిలర్ వనజ, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మున్సిపాలిటీకి కొత్తగా వచ్చిన ఐదు వాటర్ ట్యాంకులతో పాటు మౌంటెడ్ ల్యాడర్, జెట్టింగ్ మిషన్లను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎంపీ డీకే అరుణ ప్రారంభించారు. పట్టణంలోని 14వ వార్డు పరిధిలోని వీరన్నపేటలో 4వ వార్డు ఎదిరలో, 37వ వార్డులోని సద్దలగుండులో, 24వ వార్డులో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాన చేశారు. రూ.పది లక్షలతో నిర్మించిన యువజన సంఘం కమ్యూనిటీ హాల్‌ను వారు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్ యాదవ్, కౌన్సిలర్లు తోక యాదమ్మ, కె.స్వప్న, కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాద్రీ, అంజయ్య, రఘు, మల్లేష్, దాసరి శ్యాముల్, రవికిరణ్, వెంకటేశ్వరచారి, చక్రధర్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డితోనే ఎస్సీ వర్గీకరణ..

మహబూబ్‌నగర్ రూరల్: సీఎం రేవంత్‌రెడ్డితోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్ అధ్యక్షతన డా.పిడమర్తి రవి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ఫిబ్రవరి 2న జరిగే మాదిగ విద్యార్థి యువగర్జన బహిరంగ సభ కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డమీది గోపాలకృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్ట యాదయ్య, రాష్ట్ర కార్యదర్శి దండు దేవన్న మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి వెంట నడిచి ఎస్సీ వర్గీకరణ సాధించుకుందామన్నారు. ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లో జరిగే మాదిగ విద్యార్థి యువగర్జన సభకు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఎరుకల కులస్తుల అభ్యున్నతికి కృషి

ఎరుకల కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎరుకల భవన నిర్మాణానికి చేయూత ఇవ్వాలని ఆ సంఘం నాయకులు కోరగా అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి మండల తహసీల్దార్‌కు పరిశీలించాలని ఆదేశించారు. ఆసంఘం జిల్లా అధ్యక్షుడు లాల్‌కోట శ్రీనివాసులు, కార్యదర్శి బాలరాజు, కృష్ణ, రాములు, లక్ష్మి, జానకమ్మ, దశరథ్, మహేష్ పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలి



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ముదిరాజ్ సంఘం నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాజ్యాధికారం దిశగా ముదిరాజ్‌లు ముందుకు సాగాలని ముదిరాజ్ మహాసభ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం కొత్తగంజి చౌరస్తాలో ఏర్పాటుచేసిన ముదిరాజ్ మహాసభలో సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు తమ పబ్బం గడుపుకోవడానికి ముదిరాజులను వాడుకుంటున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎన్పీ వెంకటేష్ మాట్లాడుతూ ముదిరాజ్‌లకు సముచితస్థానం కల్పించని పార్టీలకు రాజకీయ మనుగడ లేకుండా చేయాలన్నారు. బీసీ రాజ్యాధికార సమితి మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మైత్రి యాదయ్య, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పెద్ద విజయకుమార్ మాట్లాడుతూ సబ్బండ వర్గాల రాజ్యాధికార సాధన కోసం ప్రయత్నం జరగాలన్నారు. కార్యక్రమంలో గోనెల శ్రీనివాసులు, ఎర్ర వెంకటయ్య, గంజి నాగరాజు, బునేడు బాలరాజు, కస్తూరి తులసీరామ్, కృష్ణయ్య, తిమ్మాపూర్ నరసింహ, గంజి శ్రీనివాసులు, గూర కొండ యాదయ్య, సత్యం, తిమ్మాపురం యాదయ్య, ఏపీ శ్రీనివాసులు, గంజి శేఖర్, గూడెం ఆంజనేయులు, సంతోష్, పటేల్ ప్రశాంత్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మర్దాన్‌అలీషా దర్గా ఉర్సు



గంధోత్సవంలో పాల్గొన్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక షాషాబ్‌గుట్టలోగల హజ్రత్ సయ్యద్ మర్దాన్‌అలీషా దర్గా 99వ ఉర్సును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం రాత్రి గంధోత్సవం వైభవంగా కొనసాగింది. గంధోత్సవాన్ని షేక్ మొహియొద్దీన్ ఇంటి నుంచి వన్‌టౌన్, న్యూటౌన్ మీదుగా దర్గా వరకు తీసుకెళ్లారు. ఉర్సు ఊరేగింపులో భక్తులు భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం దర్గాలో పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దీపారాధన, ఖవ్వాలి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ రజాక్‌షాఖాద్రీ, అఫ్రోజ్‌షా, జఫర్‌షా, వాసిఫ్‌షా పాల్గొన్నారు.

ఆర్టిజన్లతో వెట్టి చాకారి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ శాఖలో ఆర్టిజన్స్‌గా పని చేస్తున్నవారితో వెట్టి చాకిరి చేయిస్తున్నారని విద్యుత్ శాఖ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. స్థానిక విద్యుత్ భవన్ ముందు నిర్వహిస్తున్న రిలే దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20వేల మంది ఆర్టిజన్లను వెంటనే క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్టీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాంనాయక్, డివిజన్ సెక్రటరీ గోపాల్‌నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు క్యాలెండర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ రూరల్: మాల మహానాడు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ మాలల అభివృద్ధికి ప్రజాప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా నుగడ్డ యాదయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, నాయకులు శ్రీనివాసులు, గోకం చెన్న య్య, జగదీష్‌కుమార్, యాదగిరి పాల్గొన్నా రు.

వాలీబాల్ కిట్ అందజేత



దేవరకద్ర: మండలంలోని కోయిల్‌సాగర్ గ్రామ జెడ్పీహెచ్‌ఎస్‌కు జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ గురువారం వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం, ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయికి విద్యార్థులు ఎదగాలని కోరారు. రిపబ్లిక్ డేను పురస్కరించుకొని పాఠశాలలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు 26వ తేదీన బహుమతులు అందిస్తారని పాఠశాల సిబ్బంది తెలిపారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్, శ్రీను, చందుగౌడ్,అబ్దుల్, పి.శ్రీను, మోహన్, ఖాజామైనోద్దీన్ పాల్గొన్నారు.

కేబుల్ వైర్ చోరీ

నవాబుపేట: మండలంలోని దేపల్లిలో గురువారం బోరు మోటారుకు చెందిన కేబుల్ వైర్ చో రీకి గురైనట్లు రైతు ప్రవీణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.20 వేల విలువ గల కేబుల్, స్టార్టర్లు చోరీకి గురైనట్లు రైతు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

హన్వాడ: మండలంలోని కొనగట్టుపల్లికి చెందిన వివాహిత రావుల చెన్నమ్మ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఈనెల17న ఇంట్లోంచి ఎప్పటిలా కూలి పనికని భర్త రాజుకు చెప్పి వెళ్లినట్లు వివరించారు. ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో ఆమె తల్లి జంగ అంజమ్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.